# ప్రేమా-ఆకర్షణల మధ్య పిడికెడు దూరం



హంపీ శిథిలాల గురించి చారిత్రాత్మకమైన ఆర్కియాలాజికల్ రీసెర్చి చేద్దామనే నా కుతూహలం ఈనాటిది కాదు. రాళ్లన్నా రప్పలన్నా ఎందుకురా ఇలా పడిఛస్తావ్ అని నన్ను ఎగతాళి చేసినవారెందరో ఉన్నారు. నా మనస్సుకి మాత్రం ఆ రాళ్ళని చూసి తన్మయత్వం చెందే సున్నితమైన ఆర్టిస్టిక్ హృదయ స్పందన ఏ భగవంతుడిచ్చిన వరమోననిపిస్తుంటుంది. ఆ రాళ్ళలో కూర్చుని ఏ ఊహాలోకాల్లోనో తేలిపోతూ అలనాటి సౌభాగ్య వైభవాల్ని స్మృతిపథంలో నిలుపుకొంటూ వాటితో మౌనంగా మాట్లాడటంలో నేను పొందే తాదాత్మ్యం ఓహో! మనస్సుకి ఎడతెగని రిలీఫ్ నిస్తుంది. అఫ్‌కోర్స్ నాలాంటి పిచ్చివాడెవడూ ఉండడేమోనని కూడా అనిపిస్తూంటుంది_అప్పుడప్పుడు.

అవే రాళ్ళు గతజన్మల వైభవాల ప్రదర్శనలకు ప్రతీకలు. రాజులసొమ్ము రాళ్ళపాలు అనే నానుడి బహుళ ప్రచారంలోకి వచ్చినా ప్రస్తుత నవ్య నాగరికతకి పునాదిరాయి రాతియుగపు నాగరికతా విప్లవం. మొహెంజదారో, హరప్పా త్రవ్వకాల శిథిలాలలో బయల్పడిన సింధునాగరికత మానవుని మేధస్సుకి సుఖలాలసతపట్ల అతడికున్న అసక్తినీ నిరూపించి, మానవుని జీవిత విధానాన్నే మార్చడానికి దోహదం చేసి, నాగరికతా విప్లవాన్నే లేవదీసిందని నేను ఘంటాపథంగా చెప్పగలను. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్య వైభవాలని వేనోళ్ళ చాటిచెప్పే ఆ హంపీ శిథిలాల రాళ్ళనిచూసి కన్నీరు చిందని తెలుగువాడెవడైనా ఉన్నాడూ అంటే వాడిది నిజంగా రాతిగుండె అని చెప్పాల్సి ఉంటుంది.

సడన్‌గా "కీ" అనీ టూరిస్ట్‌బస్ హారన్ నా ఆలోచనల గొలుసుకట్టుని త్రెంచి వేసింది. ముందస్తుగా ఒకసారి పరిసరాలన్నింటినీ ఓవరాల్‌గా చిన్న సర్వే చెయ్యటం నా ప్రయత్నానికి నాందీ ప్రస్తావనగా ఉంటుందని, దానికి టూరిస్ట్ బస్సే సరైన సాధనం అనీ అంతకు ముందు రోజే టిక్కెట్ రిజర్వ్ చేయించుకున్నాను. గతరాత్రి హోస్‌పేటలోని టూరిస్ట్‌లాడ్జ్‌లో అనుభవించిన తాలూకు ఆనందచ్ఛాయలు నెమరువేసుకుంటూ చిన్నగా నవ్వుకున్నాను. నెమ్మదిగా బస్ నిండుతోంది. నా ప్రక్కన సీటు ఇంకా ఖాళీగానే ఉంది. బేగ్ నా సీట్‌లో ఉంచి క్రిందికి దిగేను సిగరెట్ వెలిగించుకుంటూ. వేసవి తాలూకు వాయలు విస్తరించుకుంటున్నాయి. ఈ ప్రయాణంలో ఆనందాన్ని పంచుకోవడానికి రాని మాధురిమీద నాకు బోలెడు కోపం వచ్చింది. కాలం ఆనందంగా గడవటానికి ఆడదాని తోడుండాలంటారు అనుభవజ్ఞులు. కాని, మాధురికివేమీ పట్టవు. అన్నట్లు, మాధురి ఎవరో కాదు-నాతోబాటు పదిహేను వసంతాలు తోడుగడపిన ప్రియురాలు- నా అర్ధాంగి. ఎంతసేపూ బాబీ, శోభా, గీతాల తోడిదే ఆమె లోకం. వీళ్ళు ముగ్గురూ మా అనురాగానికి ప్రతిబింబాలు. హుఁ! ఎంతసేపూ వాళ్ళూ, వాళ్ళ ముస్తాబులూ, వాళ్ళ చదువులూ ముచ్చట్లే మా మాధురికి ప్రాణం. చివరికి పడకటింట్లో కూడా ఏకాంతంలో తాదాత్మ్యం పొందాల్సిన క్షణాల్లోనూ "ఇవాళ బాబిగాడి స్కూల్లోనటండీ." అంటూ ఉపోద్ఘాతం మొదలెడుతోంది. నాలోని ఆర్టిస్ట్ హృదయం బాధగా విలవిలలాడి పోతుంది అయినా కూడా మాధురి ముఖంలోని అమాయకతా, ఆ చెప్పే తీరూ నాకు పకపక నవ్వు పుట్టిస్తుంది. అందమైన క్షణాల్ని కూడా ఆవకాయీ, గోంగూర పచ్చడితో ఖూనీచేసే ఇలాంటి

మనస్తత్వాలంటే నాకు తెగని చిరాకు. అయినా మాధురి ముఖంలోని ఆకర్షణా, ఆ కళ్ళలోని అమాయికతా నన్ను ముగ్ధుణ్ణి చేస్తుంది. అలా-మాధురి ముఖంలోకి చూస్తూ గంటలకొద్దీ కాలాన్ని క్షణాలక్రింద ఖర్చు చెయ్యగలను-ఆ కళ్ళలోని కళాకాంతులని చూస్తూ ఊహాలోకాల్లో తేలిపోతూ, అలాగని జీవిత కాలమంతా పైలాపచ్చీసుగా గడిపి వేయాలనుకునే ధీరికాదు నాది-అందమైన వస్తువుల పట్ల ఆకర్షణ-భగవంతుడు సృజించిన అందాల్ని ఆరాధించే స్వభావమే, అందంపట్ల నా హృదయంలోని ఆర్టిస్ట్ కొస్త కట్లు తప్పుకుంటాడనేది వాస్తవానికి దగ్గరే. నిజానికి కలల్లో జీవించే నాలాంటి భావుకు లందరూ ఇంతేనేమో!!

నిజానికి పారిజాతాపహరణం, మనుచరిత్ర వర్ణనల దగ్గర్నుండీ, సుశీల శ్రావ్యంగా పాడే "సన్నజాజికి గున్న మావిడి పెళ్ళి కుదిరిందీ" అనే పాట వరకూ ఏ అందానికి ఆ అందాన్ని ఊహించుకుంటూ ఊహాలోకాల్లో తేలిపోవడం నాకెంత ఇష్టమో. ఆర్కియలాజికల్ విభాగంలో డాక్టరేట్ తీసుకుని, ఆ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తూ కూడా ఏమిటండీ ఈ చిన్నపిల్లల చేష్టలూ అని మూతి సగం వంపుత్రిప్పుతూ వెక్కిరించే మాధురి ముఖంలో చూస్తూ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి "తపోభంగము" లో "శైలరాణ్ణందనవంగె, అనంగుని శాపము వంగె, వంగెబాలేందుధరుండు" అన్న సీక్వెన్స్ మధురాతి మధురంగా, అతి రమ్యంగా ఊహించుకోగలను.

సిగరెట్ చురుక్కుమని వ్రేళ్ళకి తగలడంతో ఉలిక్కిపడి విసిరేశాను. తిరిగివచ్చి సీట్లో కూర్చున్నాను. బస్ స్టార్ట్ అవడానికి ఇంకా వ్యవధి రెండు మూడు నిముషాలుందనగా సన్నగా రివటలో ఉండే అమ్మాయి హేండ్ బేగ్ భుజానికి తగిలించుకుని బస్ వైపుకి పరుగెత్తుకుంటూ రావడం చూశాను. దూరంనుండీ చూస్తుంటే చిరపరిచయమైన ముఖంలాగా ఉంది. యస్-నిజంగా తు . ల .. సి ...!! అఫ్‌కోర్స్, బస్ వాళ్ళు కూడా ఆమెకోసమే నిరీక్షిస్తున్నట్లుగా ఉంది.

తులసి గబగబా బస్ఎక్కి నన్ను చూసి ఆశ్చర్యపోతూ "అరెరె.. నమస్తే ప్రొఫెసర్ సాబ్! మీరూ వచ్చేరా?" అంటూ ప్రశ్నించింది.

నాకూ అంతులేని ఆనందంగా ఉంది ఒక(ఆడ) తోడు దొరికినందుకు.

తులసి ఒకానొకప్పుడు నా స్టూడెంట్ - నా ఫాన్.

వచ్చి కూర్చుంది నా ప్రక్కనే. తులసి కూడా నిన్ననే బస్ టికెట్ రిజర్వ్ చేసుకుందట. అందుకనే కాబోలు ఆమె రాగానే బస్ స్టార్ట్‌యింది.

ఆ తరవాత పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అయిన దగ్గర్నుండి ఎక్కడెక్కడ పని చేసిందో చెప్తూ, ప్రస్తుతం హైద్రాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పింది మంచి మాటకారితనం కూడా నేర్పింది.

అదే అన్నాను ఆమెతో.

రెస్పాన్స్‌గా చిన్న నవ్వు నవ్వింది.

ఓహ్! అదే ఆకర్షణ. కొన్నేళ్ళ క్రితం తన చుట్టూ నన్ను త్రిప్పుకొన్న ఆ స్వరం ఆ హొయలు. అదే నవ్వు. కాకపోతే చేస్తున్న ఉద్యోగము వలన వచ్చే సెల్ఫ్‌కాన్ఫిడెన్స్ - హుందానిచ్చి మరింత ఆమె అందాన్ని రెట్టించిందే కాని ...అదే తులసి. కొద్ది క్షణాలపాటు నా ఊపిరి స్థంభించిపోయింది.

మనస్సు గతంలోకి జారుతుంది.

అవి కాలేజి అడ్మిషన్ రోజులు. యూనివర్సిటీ ఉన్నత విద్యాభ్యాసనార్థం క్రొత్త యువతరం విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టే శుభఘడియలవి ఈ సమయంలో పాతక్రొత్త మేలుకలయికకై అనాదిగా వస్తున్న ఆచారం రేగింగ్.

విశ్వవిద్యాలయంలో క్రొత్తగా అడుగుపెట్టే విద్యార్థీ విద్యార్థినులని వారి అమాయికతని చిదిమించి వారిలోని భయాన్ని పోగొట్టడానికని కొంతమంది పాత విద్యార్థులు కలసి చిన్న గ్రూప్స్ క్రింద చేరి క్రొత్తగా చేరిన వారిని పట్టుకొని కొంత ఆటపట్టిస్తారు-ఒక రకమైన ఈవ్ టీజింగ్. హద్దుల్లో ఉన్నంతవరకూ ఈ పద్ధతి మంచిదే.

ఆర్కియాలిజీ లేబ్‌నుండి వస్తూ స్కూటర్ని పార్క్‌చేసి యధాలాపంగా వరండాలో నడిచి వస్తున్నాను. అదే వరండాలో ఓ మూల ఆకర్షణీయమైన సంఘటన కనిపించింది. అడుగుల జోరు తగ్గించి మెల్లగా నడవసాగేను. ఓ ఆరుగురు ఫైనలియర్ స్టూడెంట్స్ కొత్తగా చేరుతున్న ఓ అమాయక బాలికని పట్టుకొని టీజ్ చేస్తున్నారు. వరండా నుండి ప్రక్కనున్న కారిడార్లోకి తిరిగి వాళ్ళకి కనిపించకుండా శ్రద్ధగా గమనించసాగేను. "రేగింగ్" హద్దుల్లో నడుస్తోందా, హద్దుమీరి క్రమశిక్షణకి లోటు చేస్తున్నదా తెల్సుకుందామనే ఉత్కంఠతో.

"నీ పేరేంటమ్మాయ్" అని అడిగింది పద్మజగొంతు. పద్మజ అన్నింటిలోనూ ఫార్వర్డే

"తులసి." అంది ఆ పిల్ల.


"ఉట్ట బెదురుచూపుల గొడ్డే" అంది మరో గొంతు.

"అజంతా చిత్ర సుందరిలాగుందే అమ్మడు" అంది మరో గొంతు

"సతీతులసీ! జలంధరు డెక్కడ నున్నవాడు?" అంది మరో గొంతు.

'లేదే సఖియ శ్రీకృష్ణుని బృందావనమ్ము నలంకరింపబోవు" అన్నది మరో చిన్నది.

18



"అర్కియాలజీ గ్రూప్ సబ్జక్ట్‌గా తీసుకున్న ఓ అందాల రెమ్మా! మన ఊరేదీ?' అని అడిగింది పద్మజ నాటక ఫక్కీలో.

అతికష్టంమీద గొంతు పెగుల్చుకొని 'రాజమండ్రి' అన్నది తులసి. స్వరంలో ఏడుపుజీర ధ్వనించటం చూసి ఇంక బాగుండదని ఇంటర్ఫియర్ అవడానికని అడుగు ముందుకేశాను.

"ఓ అజంతా చిత్రసుందరీ - ఏదీ ఓసారి రామప్పగుడి ముందర వెలసిన నాగిని భంగిమ ప్రదర్శించు విన్నొది లేస్తాం' అన్నారు అందరూ ముక్త కంఠంతో.

ఆ పిల్ల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయ్. బిక్కచచ్చిపోయింది వీళ్ల మెరుపుదాడికి.

ఈలోగా నా రాకచూసి అందరూ "గుడ్‌మార్నింగ్ సార్. అవర్ న్యూ ఎంట్రెంట్ 'మిస్ తులసి' అని నాకు పరిచయంచేశారు.

తొట్రుబాటుతో "న నమస్తే సార్" అంది తులసి.

"యస్ పద్మజా .. దిసీజ్ యనవ్. లీవ్‌హర్ ఫ్రీ" అన్నాను.

పద్మజ నవ్వేసి ఆప్యాయంగా తులసి భుజంమీద చెయ్యివేసి తీసికెళ్లిపోయింది తనతో.

అలాగయ్యింది మా మొదటి పరిచయం.

"క్రీచ్" మని శబ్దంచేసుకుంటూ బస్ ఆగింది. బస్ ఆగిందే తడవు బిలబిల మంటూ అందరూ దిగి శిథిలాలవైపు పరుగులు తీశారు. ఇదొక వినోద యాత్రికుల యాత్రాస్థలం. దిగిందే తడవు మా ఇద్దర్నీ గైడ్స్ చుట్టుముట్టారు- సింప్లీ వ్యాపారానుబంధం.

"కోటి విద్యలూ కూటికొరకే ప్రొఫెసర్ సాబ్, రండి" అంటూ ఓ గైడ్‌ని రమ్మని పిలిచింది తులసి. మంత్రముగ్ధ భుజంగంలా ఆమెని అనుసరించటం తప్ప నే నింకేమీ చెయ్యలేకపోయాను. మనస్సులో ఒకనాటి కృష్ణదేవరాయల ఔన్నత్యానికి పొంగిపోతూ అలనాటి తెనుగు సామ్రాజ్యలక్ష్మి వైభవాన్ని తలచుకొంటూ అనేక రకాలైన టెక్నికలర్ ఊహలతో నా మనస్సు సాగరతీర తరంగ ఘోషలా ఉంది.

"సార్ ... ఇది విఠలస్వామి దేవాలయం...." అంటూ స్థలమహాత్యం, శిల్ప వాస్తు ప్రాముఖ్యం మొదలైన అంశాలన్నీ వివరించ సాగేడు గైడ్.

"చూశావా తులసీ! ఈ శిల్ప సౌకుమార్యం. రాతిని మీటి సప్తస్వరాలూ పలికించగలిగిన ఈ చాతుర్యం రాయలవారి రసికతకీ, కళపై అతనికున్న అభిరుచినీ ఎంతాశ్చర్యకరంగా మనకి తేటతెల్లం చేస్తుందో! అయినా ప్రపంచంలో కంతటికీ వింతైన విషయం తట్టిన శిలలుకూడా సప్తస్వరాలు పలకటం.చేతితో తాకి శిలల చేత కూడా మాట్లాడించగల్గిన నేర్పరితనం గల శిల్పులు మనదేశం అందునా మన తెలుగు దేశంలో ఉండట- ఆర్కియలాజికల్ ఇంపార్టెన్స్ కదూ?"

"ఈ ఏక శిలా రథం- దానిలోనే చక్రాలూ, ఇరుసూ అన్నీ దిగ్భ్రాంతి కలిగించేలా అత్యద్భుతమైన పనితనం ఇవన్నీ చూస్తుంటే నిజంగా మతిపోతుంది కదూ? శిల్పశాస్త్రం శాలూకు అంచులు చూడగలిగిన ఆ మహనీయ మూర్తులని తలచుకుంటేనే ఒళ్లు పులకరించిపోతుంది తులసీ..." అంటూ విడివిడిగా ఒక్కొక్క శిల్ప ప్రాముఖ్యాన్నీ సమగ్రంగా వివరించి లెక్చెరిస్తూఉంటే మంత్రముగ్ధలా హేలగా తల ఊపుతూ వింటోంది తులసి. అటు గైడ్ వెలవెలబోతూ నిల్చున్నాడు.

ఈ లోగా "ప్రొఫెసర్! టైమవుతుంది పదండి" అంది తులసి. బస్ హారన్ విని, గైడ్‌కి పేచేస్తుంటే సిగ్గుపడి వెళ్లిపోయాడు.

బస్ కదిలింది.

"ప్రొఫెసర్! ఈ జాలీట్రిప్‌కి మీ మిసెస్‌ని తీసుకురాలేదేం? మీ సంతానం ఎంత మంది?" అని అడిగింది తులసి బేగ్‌లోంచి ఏపిల్ తీసి కట్‌చేసి ఇస్తూ.

అందమైన ఈ వాతావరణాన్ని కలుషితం చేసింది ఈ ప్రశ్నవేసి అని బాధపడ్డాడు నా హృదయంలోని ఆర్టిస్ట్. ఇదే విధంగా సుతారంగా ఏపిల్ ముక్కలు

అందిస్తూ హేపీగా, కులాసాగా, గోముగా కబుర్లుచెప్తూ- ఇటువంటి జంట జీవితాంతం ఉంటే ఓహ్! కాలం స్తంభించి పోదేమో అనిపించింది అంతరాంతరాల్లో.

నవ్వుతూ సమాధానం చెప్పేను పిల్లల స్కూల్స్ డిస్టర్బ్ అవుతాయని రాలేదంటూ కొద్దిగా కుటుంబ వివరాలు వర్ణించేను టూకీగా.

కొండల నడుమనున్న రహదారిలో బస్ సాఫీగా నడుస్తోంది. చుట్టూకుప్పబోసినట్లున్న రకరకాల పరిమాణాల్లోనున్న గండశిలలూ, మధ్య మధ్య నున్న విశాల మైదానాల్లోని పచ్చని చేలూ పర్వత పంక్తులూ. ఈ పరిసరాల్ని స్టడీచేస్తుంటే విద్యారణ్యులవారు ఈ ప్రదేశాన్ని ప్రధాన నగరంగా ఎంచుకోవడంలో ఏ పొరపాటూ ఏమాత్రం చెయ్యలేదని పిస్తుంది. ప్రధాన నగరం తాలూకు రక్షణ సహజంగానే ఈ పర్వత పంక్తులు ఇస్తున్నాయి. శత్రుభేద్యం కాని ఈ ప్రధాన నగరంలో అడుగు పెట్టడానికే చాలా దూరం ప్రయాణం చెయ్యాల్సి ఉంటుంది. ప్రయాణ సాధనం లేనిదే శ్రమతో కూడిన పని. ఎత్తైన పర్వత పంక్తుల నడుమ తుంగభద్రానది అంచెలంచెలుగా దుముకుతూ చిన్న చిన్న రాళ్లని స్పృశిస్తూ, వంపులు తిరుగుతూ విశృంఖలత లేని వయస్సులా నర్తిస్తూ ప్రవహించి నయనానందకరం చేస్తూ ఉంటుంది.

ఎక్కడ చూసిన సరే ఈ హంపీ విజయ నగరంలో శిలామందిరాలూ, శిలావేదికలూ, శిలామంటపాలూ, ఆరామ గృహాలూ కనిపిస్తూ ఉంటాయి కోట బురుజులూ, ఎత్తైన శిఖరవేదికలూ దుర్గరక్షణ గురించి వారు ఆరోజుల్లో తీసుకున్న రక్షణోపాయాల్ని సూచిస్తాయి. గతచరిత్రని తరచి చూస్తే రక్షక సైన్యానికీ, నగర రక్షణోపాయాలకూ, మంత్రాలోచనా కార్యక్రమాలకూ, గూఢచారుల నియామకాలకూ వారిచ్చిన ప్రాముఖ్యత రాయల సామర్థ్యాన్నే గాక మహామంత్రి తిమ్మరుసు ప్రజ్ఞాపాటవాలనీ, రాజనీతి తజ్ఞతనీ, చతురమతినీ వేనోళ్ల చాటి చెపుతుంది— ఇవన్నీ తులసితో చర్చించాను.

పరిపాలనా యంత్రాంగాన్ని, రాచరికపు చక్రాన్ని వారేరీతుల్లో నడిపించగలిగారో తులసికూడా దానికి తీసిపోని రీతిలో చర్చిస్తూ, ఆ రోజుల్లో లలితకళలకి వారిచ్చిన ప్రాముఖ్యత, ఆర్షధర్మ పరిరక్షణార్థం వారు నిర్మింపజేసిన దేవాలయాల నిర్మాణక్రమం, తిరిగి వాటిల్లోనే నిజదుర్గ రక్షణార్థంపొందుపరిచిన రహస్యసొరంగ మార్గాలూ, అవసరమైనచోట్ల ఆదేవాలయాలనే వారి ఖజానారక్షక దేవిడీలుగా ఉపయోగించినతీరూ, శత్రువులని ప్రక్కదార్లు పట్టించడానికి పన్నే వ్యూహరచనలూ, ప్రజారక్షణ, ప్రజారంజన కార్యక్రమాలూ, సారస్వత, విద్వత్సభలూ,

భువనవిజయ నిర్మాణం, అష్టదిగ్గజాల నియామకం అతి చమత్కారంగా ఉదాహరణలతో సహా చక్కగా వర్ణించింది తులసి.

ఔను! ఆమెకూడా లెక్చరరే కదూ మరి! రెస్పాన్స్‌గా తలఊపుతు విన్నాను.

ఈ లోగా బస్ తుంగభద్రా నదీ తీరంలో ఓ రాతిమంటపం దగ్గర ఆగింది. తిన్నగా నడిచి ఆ మంటపంలోకి ఇద్దరం చేరుకున్నాము.

ఇలా ఆమె ప్రక్కన నడుస్తూ ఉంటే నేను పొందిన హాయి ఇంతా అంతాకాదు.

ఆ రాతిమంటపం నుండి క్రిందికి దిగి తుంగభద్రానదీ మధ్యస్థలంలో నున్న రాళ్లమీదుగా దుముకుతూ చిన్న పిల్లే అయింది తులసి. వేసవి అవడం వలన చిన్న సెలయేరులా మాత్రమే రాళ్ళ సందుల్లోంచి ప్రవహిస్తోంది తుంగభద్ర. ఆ నదీ మధ్యస్థలంలోనున్న పెద్ద పాయ లోని నీరు మోకాలిలోతుకూడా లేవు. చీరె అంచులు తడుస్తున్నాకూడా లక్ష్య పెట్టక గుంటలోదిగి చేత్తో నీరుచిందిస్తూ పసిపిల్లలాగా అమాయకంగా ఆడుతున్న తులసిని చూసి మా పాతరోజులు జ్ఞాపకానికి వచ్చినై.

ఆ రోజుల్లో రేగింగ్ సందర్భంలో పరిచయమైన తులసి నా హృదయంలో చెరగని ముద్ర వేసింది.

తులసి ఉన్న క్లాసు తీసుకోవలసిన మొట్టమొదటి రోజు. కాస్త హుషారుగా క్లాసులోకి వెళ్లేను. విశ్వవిద్యాలయం చదువుల్లో మొట్టమొదటి మెట్టనకాలూ నడం కనుక క్లాసంతా చిన్న గొడవ తప్పించి పెద్ద అల్లరిగా లేదు అటెండెన్స్ వేసినప్పుడు తులసిపేరు పిలుస్తున్న తరుణంలో హృదయపూర్వకంగా నా గొంతులో అత్యంతమైన అభిమానం తొంగిచూసింది. ఆ రోజు ప్రిలిమినరీగా యూనివర్శిటీ విద్యార్థికున్న బాధ్యతలూ, హాస్టల్స్‌లో ఉండే సాధకబాధకాలూ వీటి మీద అకర్షణీయమైన ఉపోద్ఘాతం ఇచ్చి స్టూడెంట్స్‌ని ఆకట్టుకున్నాను.

ఆ తరువాతకూడా తులసిపై అంతే ప్రత్యేకమైన శ్రద్ధ ఉండేది నాకు. అలాగే తులసి కూడా హైరేంక్స్‌తో వస్తూ నన్నాకర్షించింది. హాస్టల్ ఇన్‌చార్జి ఆఫీసర్నికూడా నేనే కావడంతో తులసి నా దగ్గరున్న చనువుకొద్దీ అప్పు డప్పుడు యూనివర్శిటీ కాంపస్‌లో వున్న మా ఇంటికికూడా వచ్చేది. ఇద్దరం అలా సాయంకాలాలు బీచ్‌లో చాలాసేపు కూర్చుని కాలం గడిపేవాళ్లం. అప్పట్లో తులసికి నేనంటే గురుభావమే ఉండేది. కాని నాకు మాత్రం అంతకు మించిన దేదో "కోరిక" ఉండేది నాకు తెలీకుం డానే ఆమెపైపు ఆకర్షితుణ్ణి అయ్యాను. తులసి అందం నాకు ఆమెపై నెట్టి ఆప్యాయతని తెచ్చిపెట్టింది. ఆమె స్వరం నాకు నాగుకి నాగస్వరంలాగా ఉండేది. మొట్టమొదటి నుండీ మా పరిచయం

వృద్ధిసూచకంగా ఉండటంతో ఆమె నాకేదో బంధువు అయివుంటుందేమో ననే అనుకునేవారుగాని విపరీతార్థాలు ఎవ్వరూ తీయలేదు. అందునా హైరేంక్స్‌లో ఉండే స్టూడెంట్స్‌ని ప్రొఫెసర్లు అభిమానించటం అనేది చాలా కామన్‌గా వస్తున్న అలవాటు ఈ యూనివర్శిటీ అధ్యాయంలో.

తుంగభద్రా నదీజలాల్లో చిందులు వేస్తూన్న హాయినసుభవిస్తూన్న తులసి ఆ క్షణంలో నాకు జలకన్యలాగా తోచింది. నాలోని ఆర్టిస్ట్ కట్లుతెంచుకుని ఆలోచించటం మొదలుపెట్టేడు.

కళాభిమానానికీ, నైతిక పతనానికీ మధ్య ఒకే ఒక సన్నని లక్ష్మణరేఖ ఉన్నదేమో ననిపించింది. వాస్తవానికి తులసికి నేనెన్నడూ చేరువకాలేను. కాని.... కాని ... మనస్సులో ఏదో తెలియని పోరాటం....

దూరంగా వున్న రాతిమంటపంలో నుంచి సన్నని గాలితెమ్మెరలో కొట్టుకుని వస్తున్న టేప్‌రికార్డర్‌లోని పాట "కెరటానికి ఆరాటం.... తీరం చేరాలని.... తీరానికి ఉబలాటం.... ఆ కెరటం కావాలనీ.... ఎందుకో ఈ ఆరాటం....? ఎందుకో ఈ ఉబలాటం....?" అంటూ నా మనస్సుని మరింత అల్లకల్లోలం చేస్తోంది.

కళాభిజ్ఞతకీ— కావలసిన వస్తువేదో చేరువలో వున్నప్పటికీ అనుభవానికి రాలేని నిబంధనలూ–సంఘపు కట్టుబాట్లూ–సొసైటీ ఫియర్– దానికి మించిన హృదయంలోని ఆర్టిస్ట్ తాలూకు అంఖడీ ... ఓహ్! ఎలా?

నిస్పృహాయతకీ.... తెగింపుకీ.... మధ్య పోరాటం.

చల్లని తుంగభద్రా నదీజలాలతో ముఖం కడుక్కొని, కొంత నీరు త్రాగి "ప్రొఫెసర్ సాబ్! మీరు కూడా దిగి ముఖం కడుక్కోండి సార్. హాయిగా ఉంటుంది," అంది తులసి.

మెట్లపైనే దిగుదామని కాళ్ళకున్న షూస్, సాక్స్ విప్పాలని ఆమెకే ఓ గ్లాసు అందించి నీళ్లివ్వమని అడిగేను. అలా ముఖం కడుక్కొని, చల్లటి నీళ్లు త్రాగేసరికి కాస్త రిలీఫ్ అనిపించింది.

తరువాత నెమ్మదిగా ఆ శిథిలమయమైన ఆరామ మంటపంలో కూర్చుని ఇద్దరం తెచ్చుకున్న టిఫిన్ పంచుకొని తిన్నాము.

ఆరోజుల్లో ఈ ఆరామమంటపంలో ఎంత జనసమ్మర్దంగా ఉండేదోగాని ప్రస్తుతం మాత్రం నిరామయంగా వినోదయాత్రికుల కోలాహలం తప్ప ఇంకేమీ లేదు. ఒక ప్రక్క బండల ఆ రాళ్ల గుట్టల మధ్యన ప్రవహిస్తున్న తుంగభద్ర. ఒడ్డున ఉన్న ఈ ఆరామమంటపం— చాలా ప్రశాంతమైన వాతావరణం.

టిఫిన్ చెయ్యటం పూర్తి అయిన తరువాత టిఫిన్ బాక్స్ కడగటానికి

మళ్ళీ ఆ రాళ్ళపైన అడుగులు వేసుకుంటూ నదీమధ్యస్థలంలో ఉన్న ఆ నీటి పాయ వద్దకి వెళ్ళేం. నీళ్ళు చూసేసరికి మళ్ళీ ఉత్సాహం పెల్లుబికి తులసి మళ్ళా ఆ నీటిగుంటలోకి దిగింది, వద్దని వారిస్తున్నా వినక. మళ్ళీ చల్లని నీటిని త్రాగి నీటిలో చిందులాట మొదలుపెట్టేసరికి బస్ హారన్ వినిపించింది.

"అరరే: టైంసెన్స్‌కూడా లేకుండా పోయింది సార్," అంటూ ఆదరాబాదరాగా ఆ రాళ్ళమీద అడుగులేసి రాబోయింది. నీటిలోని రాతికి కొంచెం జారుడు స్వభావం ఉన్నందువల్ల జారి పడబోయింది. పక్కనే ఉన్న నేను చటుక్కున ఆమె చెయ్యి నందిపుచ్చుకొని గట్టిగా పడకుండా ఆపేసుకున్నాను. అప్రయత్నంగా దొరికిన ఈ కౌగిలి, ఈ సంఘటన ఆమె మెత్తని స్పర్శానుభవం నాలోని కోరికని రెట్టింపుచేసింది.

ఆమె కొంచెం సిగ్గుపడింది.

ఆ పట్టుకున్న చేతిని వదలకుండా మంటపం దాటేవరకూ నడిచేం. నా చేతిలో ఆమె చెయ్యి నలిగిపోతోంది– నాలోని సంక్షోభం లోపలి కోరికల విజృంభణకి ప్రతిరూపంగా.

'భగవాన్– కాలం స్థంభించిపోయి ఇదే అనుభవం శాశ్వతమైపోతే .. !" నా హృదయం మూగగా కోటివేల గొంతుకలతో అక్రోసించింది.

తులసి మాత్రం ఇవేవీ పట్టించుకునే స్థితిలో లేదు. వచ్చిన టూరిస్టులంతా తేనెపట్టుని చేరదలచుకున్న తేనెటీగల్లాగా బస్‌పైపే త్వరత్వరగా పరుగులెత్తడం చూసిన తులసి కాన్‌సన్‌ట్రేషన్ అటువైపే ఉంది.

నా దృష్టి మాత్రం తులసి అంగాంగ సౌందర్యాన్నే ఆస్వాదిస్తోంది, నాలోని అలజడికి అనుగుణ్యంగా.

బస్ తిన్నగా బయల్దేరి అవగింజ విఘ్నేశ్వరుడు, శనక్కాయ విఘ్నేశ్వరుడు, కోదండరామాలయం సెంటర్లో ఆగింది.

ఆ రోజుల్లోని అవగింజ విఘ్నేశ్వరుడు, శనక్కాయ విఘ్నేశ్వరునికీ వ్యత్యాసం కంపేరిజన్‌లోని వారి ఊహకి హాయిగా తృప్తిగా నవ్వింది తులసి.

ఆమె ఆనందంలో నేనూ పాలుపంచుకున్నాను.

విజయనగర సామ్రాజ్యపు గజశాలలూ, కోట బురుజులూ, పద్మమహల్ ఇవన్నీ చూసినపుడు తులసికళ్ళల్లో ప్రతిబింబించిన ఉలుకు, నన్ను సమ్మోహనం చేసింది.

మహారాణీవారి స్నానమందిరం, దానికి తుంగభద్రానది నుండి నీరు మలచడానికి ఏర్పాటుచేసిన రాతి నాళాలూ, చివరికి ఊరి వెలుపల పతితలకికూడా వేరే స్నానఘట్టాన్ని ఏర్పరచిన విజయనగర ప్రభువుల విశాలదృక్పథం, వారి పరి



పాలనా వ్యవస్థకి ఎంతైనా గీటురాయి అనిపించింది.

అంతేకాకుండా తుంగభద్రా నదికి ఆనకట్ట కట్టి రాజ్యమంతా వలసిన పంట కాలువలు త్రవ్వించి, ఇరిగేషన్ స్కీము కూడా ఒక పధకం ప్రకారం నడిపించిన తీరు తెన్నులు ప్రజాక్షేమం కోరే వారి పరిపాలనలోని ప్రత్యేకత. ఈ విషయాలన్నీ తులసీ, నేనూ సమగ్రంగా చర్చించుకున్నాము.

ఇన్ని ఉన్నా ఈ పురావస్తు సామగ్రిని సరైన రీతిలో పొందుపరచి శుభ్రమైన రీతిలో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చెయ్యలేక, టూరిస్ట్‌బస్‌లలో సరైన గైడ్స్‌ని ఉంచలేని ప్రస్తుత పరిపాలనా వ్యవస్థకి నాకు కొంచెం బాధ అనిపించింది.

"అరుదైన ఈ పురాతన సామగ్రి భవిష్యద్వర్గాల వారికి ఓ గైడ్‌లైన్. దీని పరిరక్షణకి ప్రస్తుత కర్ణాటక ప్రభుత్వం

సరైన చర్యలు తీసుకోలేదు మాష్టారూ" అంది తులసి.

"నిజమే. గతించిన విజయనగర సామ్రాజ్యపు స్వర్ణయుగ అవశేషాలు చూసే తెనుగుబిడ్డకి కంటనీరు పెల్లుబికి రాకమానదు. అరుదైన ఈ అపురూప నగర సౌందర్యం కొంత తరువాత వచ్చిన తురుష్క ప్రభువుల చేతిలో నాశన మయ్యింది. రత్నాలు రాశులుగా పోసి విక్రయించిన విశాల వీధులు నేడు పాడుబడి ఊహకైనా అందరాని స్థితిలో ఉన్నాయి రాజుని ఒకవైపు రత్నాలు ఒక వైపు పోసి తూచి అనేక స్వర్ణదానాలు చేయించిన రాజతులాభారం నేడు నామ మాత్రపు శిథిలావశేషంగా పడిఉంది. ఒకనాడు అశేష దక్షిణాపథాన్ని ఉగ్రూత లూగించిన తెలుగురేని పరాక్రమం తరువాతి తరాలు నిలబెట్టుకోలేక పోయేయి నామమాత్రానికైనా ఉన్న ఈ శిథిల విశేషాలు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఉంటే ఎక్కడ హంపీ? ఎక్కడి తెలుగుదనం?" అని నా మనస్సు ఆక్రోశించింది.

నగర పరిరక్షక దైవం – రాయలు ఇలవేలుపు అయిన విరూపాక్షస్వామిని దర్శించుకొన్నాము నేనూ, తులసీ

ఆ తరువాత తుంగభద్రానది ఆనకట్ట మీద కాస్త విహరించి, రోజల్లా పొందిన శ్రమని చల్లనిగాలిలో కొంత నివృత్తి చేసుకున్నాం. అలసిపోయిన తులసి ముఖం సాయంకాలపు నీరెండలో మరింత ఆకర్షణీయంగా కనిపించింది.

ఒకనాడు తులసిని నేను ప్రేమించాను. కాని ఆ ప్రేమ తులసి నా స్టూడెంట్ కాబట్టి ఆ రోజుల్లో తెగించి వ్యక్తీకరించ లేకపోయాను.

సింప్లీ ఇమేజ్ ఫియర్.

తులసి విద్యాభ్యాసం ముగించి వెళ్ళి పోయింది. కొన్నాళ్ళు తెగింపులేని నా పిరికితనానికి చాలా బాధపడ్డాను.

కాలగర్భంలో కలిగిన మార్పుల్లో మాధురితో నాజీవితం ముడిపడిపోయింది మాధురితో గడచిన నా జీవితచరిత్రలో అసంతృప్తి అన్నది ఎక్కడా గోచరించ లేదు

కాని వాస్తవానికి ఆలోచిస్తే ఊహ లోకాల్లోనే జీవించే వ్యక్తుల జీవితం ఒక "నిషా"కి అలవాటైన మనిషిలాగానే ఉంటుందేమో?

అందం పట్ల ఆకర్షణ ప్రకృతి సహజమైన బయోలాజికల్ రియాక్షన్.

అదే నిజమా?


తులసిపట్ల నా కుందేది కేవలం ఆకర్షణ మాత్రమేనా!

ఏమో ?? ఏమో . ??

నా మనస్సంగీకరించకుండా ఉంది.

అయితే మాధురిపట్ల నా కుందేది కేవలం కృతజ్ఞతాప్రాయమైన అను రాగపు కాంక్షా? వైవాహిక సూత్రంతో ముడిపడ్డ మా జీవితాలు కేవలం

ఇంటింటి రామాయణం :




సామాజిక దృక్పథంలో నిర్ణయించబడిన హద్దులవరకే పరిమితమా?

అంతే ?

జరిగిన మా వివాహాన్ని కేవలం ఓ కాంట్రాక్ట్‌గానే ట్రీట్ చేస్తున్నానా?

నా మనస్సులో ఇంతటి సంకుచితత్వం ఉందా?

"అనాడు - ఈనాడు-ఏనాడూ - ఆడదాన్ని ఆట బొమ్మగ చేశాడు మగవాడూ .." అని టేప్‌రికార్డర్‌లో పాట సన్నగా వినబడుతోంది, బస్‌లోని వెనకసీట్ లోంచి.

ట్రిప్ అయిపోయింది.

బస్ దిగి నెమ్మదిగా మా లాడ్జివైపు దారితీశాం.

తులసి కూడా అదే లాడ్జిలో రూం తీసుకుందట.

"కొంత స్నానంచేసి రిలాక్స్ అవండి ప్రొఫెసర్ సాబ్," అంది తన రూం తాళం తెరుస్తూ.

"ఓకే" అని చెప్పి నా రూంలోకి వెళ్ళి చల్లని షవర్ బాత్‌లో స్నానంచేసి పొందిన బడలికని పోగొట్టుకున్నాను.

రాత్రి భోజనం ముగించి ఈ రోజు జరిగిన వినోదయాత్రని మననం చేసుకుంటున్నా, సోఫాలో రిలాక్స్ అవుతూ. నా కళ్ళ ముందు తులసి రూపమే మెదుల్తోంది. తుంగభద్రానదీ మధ్యస్థంలో అప్రయత్నంగా దొరికిన ఆమె స్పర్శానుభూతి నాలో విపరీత భావసంచలనం లేవదీసింది.

అదే సమయంలో తులసి తెల్లని

బట్టల్లో దేవకన్యలా మెరిసిపోతూ నా రూంలో అడుగు పెట్టింది.

"వాట్ ప్రొఫెసర్ సార్! హంపీ విజయనగరం గురించి ఏమైనా పేపర్ పబ్లికేషన్‌కి తయారుచేద్దామని ఆలోచిస్తున్నారా ఏంటి!" అంది సమ్మోహనంగా నవ్వుతూ.

మౌనంగా చిరునవ్వుతో సమాధానం చెప్పేను

తులసి వచ్చి మంచంమీద కూర్చుని వయ్యారంగా ఒళ్ళు విరుచుకుంది. ఆమె జడలోని తెల్లని మల్లెలు విచ్చుకొని మత్తైన పరిమళాన్ని వెదజల్లుతున్నాయి ఫేన్‌గాలిలో.

ఆమె సమక్షంలో నా మనస్సు వశం తప్పుతోంది.

నాకు తెలీకుండానే నా బాహువులు ఆమెను బంధించివేశాయి.

"తులసీ డియర్! ఐ లైక్ యూ వెరీమచ్" నా గొంతు ఆర్ద్రంగా గుసగుసలాడింది ఆమె చెవిలో.

నా పెదవులు ఆత్రంగా ఆమె కపోలాల్ని సున్నితంగా చుంబిస్తున్నాయ్

"లేదు లేదు మాష్టారూ! మీకు నాపట్ల ఉన్నది కేవలం ఆకర్షణ మాత్రమే. ప్రేమా—ఆకర్షణల మధ్య పిడికెడు దూరం ఉంది మాష్టారూ—ప్లీజ్ లీవ్ మీ....!" అంటూ సున్నితంగా విడిపించుకొని నిశ్చలంగా లేచినిలుచుంది తులసి.

ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టైంది. అప్రయత్నంగా ఇంకా ఆమె చేతుల్ని పట్టుకొన్న నా చేతులు విడివడ్డాయ్

"గుడ్ బై టు యూ ప్రొఫెసర్.... ఫర్‌గెట్ మీ ఫర్‌ఎవ్వర్ ఐ టు లైక్ యూ. ఆ రోజుల్లో నన్ను మీరు వివాహం చేసుకొనిఉంటే మన జీవితాలు మరో విధంగా ఉండేవి. సారీ టూ హర్ట్ యు..." అంటూ కళ్ళనుండి జారే రెండు అశ్రు బిందువుల్ని కొనగోట తుడుచుకుంటూ రివ్వున వెనుదిరిగి వెళ్ళిపోయింది తులసి.

* * *

ఆ తరువాత నాలుగైదు రోజుల్లో నాకు కావలసిన వివరాల్ని సేకరించుకొని తిరిగి వచ్చేను, శూన్యమైన హృదయంతో.

ఆ రాత్రి పక్కమీద వాలి ఏకాంతంలో ఆలోచిస్తున్నాను. తెల్లని బట్టల్లో చక్కగా రతీదేవిని తిరస్కరించగలిగిన అలంకరణతో ప్రక్కమీదికి చేరిన మాధురి "మరే మోనండీ .. ఈ రోజు శోభకి పేపర్లిచ్చేరటండీ. అన్నీ ఫస్ట్ మార్కులే " అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ ఉంటే—

"యస్ నథింగ్ బట్ ట్రూత్ . ప్రేమా — ఆకర్షణలకి మధ్య పిడికెడు దూరం ఉంది . నిజమే" అంటూ మాధురిని చుట్టేశాడు.

విస్మెరపోతూ చూసింది మాధురి; "యూ ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్, అంటూ.